క్లుప్తంగా

రోగి ఇంటికి వెళ్లి వైద్య సేవలు



అంగరలో ఇంటి వద్ద వృద్ధుడికి చికిత్స అందిస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా అంగర- 2 సచివాలయంలో బుధవారం రోగుల ఇళ్లకు వెళ్లి అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి వైద్యసేవలు అందించారు. ప్రతి నెలా 1వ, 3వ బుధవారాల్లో క్రమం తప్పకుండా గ్రామంలో శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యసేవలిందిస్తున్నారు. శిబిరంలో 95 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరానికి రాలేని వృద్ధులు, వికలాంగుల ఇళ్లకు వెళ్లి చికిత్స చేశారు. పలువురుకి రక్త పరీక్షలు చేశారు. మండుటెండలో సహితం వైద్య సేవలను కొనసాగిస్తున్న సిబ్బంది పనితీరును గ్రామస్తులు అభినందించారు. పీహెచ్‌సీ, 104 సిబ్బంది సేవలందించారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి, అరవరాజు దంపతులు

మండపేట: ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి కూలీలు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు మండలంలోని పాలతోడు సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అరవరాజు దంపతులు ముందుకు వచ్చారు. ఉపాధి పనులు చేస్తున్న 350 మంది కూలీలకు రూ. 5000 విలువైన 140 లీటర్ల మజ్జిగను సరఫరా అందజేశారు. ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీకి పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని అరవరాజు తెలిపారు. ఉప సర్పంచ్ గుత్తుల సూర్యనారాయణ, పార్టీ నాయకులు పిల్లా సూరిబాబు, తుమ్మా వీరబాబు, గ్రామ కార్యదర్శి ఎన్‌వీ రామారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ జాతర



ఆలయంలో కొలువైన ముత్యాలమ్మ

కె.గంగవరం: గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని నేడు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతర సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం వద్ద గారడీలు, బుట్టబొమ్మలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతర అనంతరం శుక్రవారం ఆలయం వద్ద తీర్థం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పలువురుకి ఎమ్మెల్సీ తోట పరామర్శ

కపిలేశ్వరపురం: ఆత్మీయులను కోల్పోయి బాధపడుతున్న అంగర, పడమర ఖండ్రిక గ్రామాలకు చెందిన పలువురుని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం పరామర్శించారు. మాతృ వియోగంతో బాధపడుతున్న పడమర ఖండ్రిక ప్రముఖుడు వంగా ఎర్రశ్రీనును ఓదార్చారు. అంగరకు చెందిన పిల్లా వెర్రియ్య, పని ప్రదేశంలో విద్యుదాఘాతానికి గురై చనిపోయిన అదే గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు శనివారపు కిశోర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ తోట పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, అడ్డాల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ళ రాంబాబు, ఇరుగ్రామాల పెద్దలు ఉన్నారు.

నేలటూరులో సర్వేరాళ్ల ఏర్పాటు

కపిలేశ్వరపురం: వ్యవసాయ క్షేత్రాల సర్వే ప్రక్రియలో భాగంగా తహసీల్దార్ కొమరం సూర్యారావు పర్యవేక్షణలో బుధవారం నేలటూరులో సర్వే రాళ్ళు ఏర్పాటు చేశారు. గ్రామ వ్యవసాయ క్షేత్రాల్లో ఇటీవల నిర్వహించిన సర్వే కొలతల ఆధారంగా రాళ్లను పాతారు. సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ సభ్యురాలు రుద్రాక్షుల వీరగౌరీకుమారి, ఉప సర్పంచ్ శనక్కాయల దొరబాబు, డీటీ బాలాజీ, వీఆర్వో టి.రాంబాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఇరువురిపై కేసు

రామచంద్రపురం రూరల్: నియంత్రణ లేని వేగంతో వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులపై మంగళవారం రాత్రి కేసులు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ బుధవారం విలేకరులకు తెలిపారు. రామచంద్రపురం పట్టణానికి చెందిన పోతాబత్తుల మురళీకృష్ణ, కాకినాడకు చెందిన యాసరపు బద్రిలపై ఈ మేరకు కేసులు నమోదు చేశామన్నారు.

నడి నెత్తిన నిప్పుల కుంపటి

- గరిష్ట ఉష్ణోగ్రతల నమోదు
- బయట వచ్చేందుకు జడుస్తున్న జనం
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు



ఎండకు తలపై ముసుగు వేసుకుని వెళుతున్న మహిళలు

రాయవరం: భానుడు భగభగలాడుతున్నాడు. ఉదయం 10 గంటలకే సూర్య ప్రతాపం మొదలవుతోంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ సమయంలో ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఎండ వేడికి వడగాలులు సైతం తోడవడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. భానుడి ప్రతాపం నుంచి తప్పించుకునేందుకు జనం శీతల పానీయాలు సేవిస్తున్నారు. ఎక్కువగా ఇంటి వద్దే ఉంటూ కూలర్లు, ఏసీల వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. అత్యవసరంగా బయటకు వెళ్లే వారు రక్షణ కవచాలు ధరిస్తున్నారు.

45 డిగ్రీల ఉష్ణోగ్రత

సాధారణంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. అలాంటిది ప్రస్తుతం 45 డిగ్రీల వరకూ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అలాగే పెరిగిన ఎండలు, వడగాడ్పులకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎండలో బయటకు వెళ్లేటపుడు ఈ క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. పాదచారులు గొడుగు నీడలో వెళ్లాలి. ద్విచక్ర వాహనదారులు ఖర్చీఫ్, టోపీ వంటివి ధరించాలి. మజ్జిగ, గ్లూకోజ్, కొబ్బరి నీళ్లను తరచుగా తాగాలి. ఒక వేళ వడదెబ్బకు గురైతే తడిగుడ్డతో శరీరమంతా రుద్దాలని, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చేలా చూడాలి. తల తిరగడం, అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి.

చల్లని ప్రదేశంలో మూగ జీవాలు

మనుషులతో పాటు పశువులు సైతం వడదెబ్బకు గురయ్యే అవకాశాలుంటాయి. సాధ్యమైనంత వరకూ మూగజీవాలు చల్లని ప్రదేశంలో ఉండేలా చూడాలి. మేత కోసం ఉదయం 8–11 గంటల వరకూ, సాయంత్రం నాలుగు తర్వాత ఆరుబయటకు తీసుకుని వెళ్లడం ఉత్తమమని పశువైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం నీడలో ఉంచి ఎక్కువ మొత్తంలో నీరు తాగేలా చర్యలు చేపట్టాలి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నపుడు చెరువుల్లో ఉంచితే పశువులు డీ హైడ్రేషన్‌కు గురికావు. పక్షులు పెంచే వారు వాటి ఆవాసం చల్లని వాతావరణంలో ఉండేలా చూడాలి. తరచుగా వాటికి నీటిని అందించాలి.

తరచూ నీళ్లు తాగాలి



ఎండలో తిరిగే వారే వడదెబ్బకు గురవుతారని అందరూ అనుకుంటారు. ఇంట్లో ఉన్న వారు సైతం దీని బారిన పడే అవకాశముంది. వడదెబ్బకు ఎండల తీవ్రత దృష్ట్యా గర్భిణులు, బాలింతలు తరచూ నీటిని తాగడం వలన రక్తప్రసరణ సాధారణ స్థితిలో ఉంటుంది. వడదెబ్బకు గురికాకుండా కొబ్బరి బొండాలు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ ఎ.దేవీరాజశ్రీ, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం

చల్లని వాతావరణంలో ఉంచాలి



పశువులు కూడా వడదెబ్బ తగలకుండా వాటిని చల్లని వాతావరణంలో ఉంచాలి. తరచూ నీటిని తాగిస్తూ ఉండాలి. పశువులు డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూడాలి. స్ప్రింక్లర్లు అందుబాటులో ఉంటే పశువుల కొట్టాలపై వాటిని వినియోగించాలి.

– డాక్టర్ బి.అనితకుమారి, ఏడీ, మండపేట ఏరియా పశువైద్యశాల, రాయవరం

రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి



సుధాకర్, పార్థసారథిలను సత్కరిస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ నాగబాబు తదితరులు

మండపేట: వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతు సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి పనిచేయాలని పలువురు నేతలు పేర్కొన్నారు. మండలంలోని ఏడిద నుంచి మండపేట ఏఎంసీ డైరెక్టర్లుగా నియమితులైన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, ముగ్గళ్ల పార్థసారథిలను బుధవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామశెట్టి శ్రీహరిబాబు, మండల వ్యవసాయ సలహామండలి డైరెక్టర్ చిలుకూరి బజ్జి, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి రామారావు, పట్నాల నాగబాబు, పార్టీ నాయకులు బేతా వెంకటేశ్వరరావు, తాతపూడి రాజేష్, బూరిగ జానీ, చంద్రమళ్ల బులివీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

- అధికారులకు ప్రజాప్రతినిధుల సూచిన
- రాయవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు మంగతాయారు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు

రాయవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ సూచించారు. రాయవరం మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించడం ద్వారా వారి సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు, మహిళలు, పేదల సంక్షేమానికి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు ప్రవేశ పెడుతోందన్నారు. అంతకు ముందుగా రెవెన్యూ, వ్యవసాయ, పశు సంవర్ధక, విద్యుత్, విద్య తదితర శాఖల పనితీరును సమీక్షించారు. అనంతరం మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులై, ప్రమాణ స్వీకారం చేసిన సిరిపురపు శ్రీనివాసరావును మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఎంపీడీవో డి.శ్రీనివాస్, తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు, ప్రభుత్వ విప్ కర్రి విజేత, వైస్ ఎంపీపీలు కొవ్వూరి అమ్మిరెడ్డి, గుబ్బల సుబ్రహ్మణ్యం, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు, ఆరిఫ్, ఎంపీటీసీ సభ్యులు, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పారదర్శకంగా చేయాలి

ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం



వెదురుమూడిలో స్వామిత్వ సర్వే తీరుపై అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం

కపిలేశ్వరపురం: గ్రామాల్లో చేపట్టిన స్వామిత్వ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని రామచంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం సంబంధిత అధికారులను ఆదేశించారు. వెదురుమూడిలో నిర్వహిస్తున్న సర్వేను బుధవారం ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామంలో సర్వే చేయాల్సిన ఇళ్ల సంఖ్య, ఇప్పటి వరకూ నమోదైన ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి యజమానులతో మాట్లాడి సర్వేపై అభిప్రాయాలను అడిగారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు, డీటీ బాలాజీ, డివిజనల్ సర్వేయర్, శ్రీనివాస్, మండల సర్వేయర్ నాగేశ్వరరావులతో సర్వే ప్రక్రియపై చర్చించారు. ఇంటి యజమానులతో సంప్రదిస్తూ సానుకూల వాతావరణంలో సర్వేను పూర్తి చేసి వివరాలను త్వరితగతిన ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట కార్యదర్శి వెలగల లక్ష్మి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అధికారుల తీరును నిరసిస్తూ ధర్నా

మామిడికుదురు: 45 ఏళ్ల నుంచి తమ స్వాధీనంలో ఉన్న భూముల నుంచి మట్టి తవ్వకాలకు అనుమతి ఇచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ పెదపట్నం గ్రామస్తులు బుధవారం ధర్నా చేపట్టారు. ఏటిగట్టుపై టెంటు వేసి టిప్పర్లు రాకుండా అడ్డుకున్నారు. పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామ పరిధిలోని 97.19 ఎకరాలు భూమి 1985 నుంచి ఆల్ క్యాస్ట్ ఫీల్డ్ కో–ఆపరేటివ్ సొసైటీకి చెందిన 425 మంది సభ్యుల స్వాధీనంలో ఉందన్నారు. ఈ భూమిలో అప్పటి నుంచి సొసైటీ సభ్యులు పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారని వాపోయారు. దీనిపై రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ కూడా పెండింగ్‌లో ఉందన్నారు. ఈ భూముల నుంచి మట్టిని తవ్వుకునేందుకు సంబంధిత శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ స్వాధీనంలోని భూముల్లో మట్టి తీయకుండా చర్యలు తీసుకోవాలని ధర్నా చేశారు. ఇక్కడ ఉన్న పరిస్థితులను రెవెన్యూ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఉన్నతాధికారుల మాట కూడా లెక్క చేయకుండా కింది స్థాయి అధికారులు మట్టి తవ్వకాలకు అనుమతిచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సొసైటీ సభ్యులకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఈ ధర్నాలో సొసైటీ అధ్యక్షుడు కోడేటి సాయిశంకరం, కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు విప్పర్తి ఏసు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాజ్‌వే కూలి ట్రాక్టర్ బోల్తా

త్రుటిలో తప్పిన ప్రమాదం



కాజ్‌వే కూలిపోయి డ్రైన్‌లో బోల్తా పడిన ట్రాక్టర్

మామిడికుదురు: రెండు గ్రామాల సరిహద్దులోని వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై శిథిలమైన కాజ్‌వే బుధవారం కుప్పకూలింది. డొక్కపొట్టు లోడుతో కాజ్‌వే మీదుగా ట్రాక్టరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్‌పై ఉన్న కూలీలు చాకచక్యంగా తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. డ్రైన్‌లో బోల్తా పడిన ట్రాక్టర్‌తో పాటు ట్రక్కును జేసీబీ సహాయంతో బయటకు తీశారు. పాశర్లపూడిలంక–లూటుకుర్రు గ్రామాల సరిహద్దులో ఉన్న ఈ కాజ్‌వే గత కొంత కాలం నుంచి శిథిలస్థితిలో ఉంది. ఇది పూర్తిగా పాడైపోయింది. కాజ్‌వేకు ఒక వైపు భాగం గతంలో దిగబడి పోయింది. అప్పటి నుంచి ఈ కాజ్‌వేపై ప్రయాణం దినదిన గండంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో కాజ్‌వే కుప్ప కూలిపోయింది. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఈ కాజ్‌వే కూలిపోవడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. నాలుగైదు గ్రామాల ప్రజలు ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. కాజ్‌వే కూలిపోవడంతో తమకు ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాశర్లపూడిలంక, లూటుకుర్రు గ్రామాల సర్పంచ్‌లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, అడబాల తాతకాపు కూలిపోయిన కాజ్‌వేను పరిశీలించారు. ఈ కాజ్‌వే పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై కూలిపోయిన కాజ్‌వేను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బుధవారం పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యుడు కళిరెడ్డి అంజిబాబు అక్కడ నెలకొన్న పరిస్థితులను ఎమ్మెల్యేకు వివరించారు. కాజ్‌వే పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చిట్టిబాబు హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నేతలు యూవీవీ సత్యనారాయణ, నెల్లి దుర్గాప్రసాద్, అంకాని వీరాంజనేయులు, చిక్కం బుజ్జిబాబు, వాసంశెట్టి రామకృష్ణ, బాలం రమేష్, యల్లమెల్లి శ్రీనివాస్, కుడుపూడి రామకృష్ణ ఉన్నారు.

ముగిసిన యేసయ్య రక్షణ మహాసభలు

కె.గంగవరం: మండలంలోని అముజూరులో గత మూడు రోజులుగా జరుగుతున్న యేసయ్య రక్షణ మహాసభలు బుధవారం రాత్రితో ముగిశాయి. గ్రామానికి చెందిన మన్నా చర్చి ఆధ్వర్యంలో సంఘ కాపరి యం.జాన్‌బాబు ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా అంతర్జాతీయ ప్రసంగీకులు బిషప్ స్టీవెన్, క్రిసోష్టమ్, బ్రదర్ శ్యామ్యూల్ తదితరులు క్రీస్తు సువార్తను ప్రకటించారు. గ్రామానికి చెందిన విశ్వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విశ్వాసులు అధిక సంఖ్యలో ఈ మహాసభల్లో పాల్గొని క్రీస్తు సువార్తను విన్నారు. చర్చికి చెందిన వారు వినిపించిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయం వద్దే మూడు రోజులు విశ్వాసులకు సహవాస భోజనలు ఏర్పాటు చేసి వడ్డించారు.

క్వారీ లారీ వర్కర్స్ సమ్మె



రామచంద్రపురంలో సమ్మె చేస్తున్న క్వారీ లారీ వర్కర్లు

రామచంద్రపురం: క్వారీ లారీ వర్కర్స్ జీతాలు, బేటాలు పెంచాలని కోరుతూ సమ్మె బాట పట్టినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం తెలిపారు. మార్చి నెలలో యజమానులకు సమ్మె నోటీసు ఇచ్చినా తమ సమస్యలపై స్పందించకపోవడంతో సమ్మెకు దిగినట్లు తెలిపారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

చిన్నారుల ఆరోగ్య రక్షణకు కృషి చేయాలి

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. వైద్యాధికారులు ఆధ్వర్యంలో సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు వీవీ రమణారావు, ఎన్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలు, గర్భిణులకు ఇంజక్షన్లు చేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను, యాంటీ బయాటిక్ మందులను అందజేశారు.

వైఎస్సార్ సీపీతోనే శెట్టిబలిజలకు గుర్తింపు



ఎమ్మెల్సీ కుడుపూడిని కలసి అభినందిస్తున్న శెట్టిబలిజ నేతలు

మలికిపురం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీతోనే శెట్టిబలిజలకు రాజకీయంగా తగిన గుర్తింపు లభించిందని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసి అమలాపురం విచ్చేసిన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణను బుధవారం అమలాపురంలో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ కుడుపూడికి శాలువా కప్పి సన్మానం చేశారు. గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శెట్టిబలిజలు ముఖ్యమంత్రి జగన్‌కు వెన్నంటి ఉన్నారని ప్రతిగా శెట్టిబలిజలకు ముఖ్యమంత్రి అధికంగా ప్రాధాన్యం ఇచ్చి గౌరవించారని ఉమ అన్నారు. జీఎన్నార్ ట్రస్ట్ అధ్యక్షుడు, ఎన్నారై డా.గెద్దాడ నాగేశ్వరరావు, సంఘ నాయకులు గుబ్బల బాబ్జి, జీవీవీ సత్యనారాయణ, గుబ్బల సత్యనారాయణ తదితరులు కుడుపూడిని కలసిన వారిలో ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు ఏఎంవీఐ అవగాహన



కొత్తపేటలో ఆటో డ్రైవర్లకు షర్టులు పంపిణీ చేస్తున్న ఏఎంవీఐ కాశీవిశ్వేశ్వరరావు

కొత్తపేట: ఆటోడ్రైవర్లు వాహన చట్టం నిబంధనలు, జాగ్రత్తలు పాటిస్తూ ఆటోలను డ్రైవ్ చేయడం ద్వారా ప్రయాణికులను భద్రంగా గమ్యస్థానం చేర్చాలని అమలాపురం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) డి.కాశీవిశ్వేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక ఈవని రామచంద్ర హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు, ఆ సంస్థతో పాటు ఈవని రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్ సామాజిక సేవల్లో భాగంగా ఆటో డ్రైవర్లు కోడ్‌గా ధరించే కాకీ షర్టులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థల చైర్మన్ ఈవని సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఏఎంవీఐ కాశీవిశ్వేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈవని రామచంద్ర పెట్రోల్ బంక్, చారిటబుల్ ట్రస్ట్ వారి సామాజిక సేవ అభినందనీయమన్నారు. అనంతరం 50 మంది ఆటో డ్రైవర్లకు షర్టులు, అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెట్రోఫిల్ మేనేజర్ విన్నకోట రాఘవేంద్రరావు, అపర్ణాంబికాదేవి, సూపర్‌వైజర్ పి.కృష్ణ, పలివెల అభయాంజనేయస్వామి ఆలయ ఫౌండర్ విన్నకోట మారుతీ బంగారం పాల్గొన్నారు.

ఆ ఘుమఘుమలేవీ ?

- సెంటిమెంటు చారుకు చెల్లిపోతున్న కాలం
- కనుమరుగవుతున్న లచ్చించారు



లచ్చించారు కుండ


మండపేట: ఘుమఘుమలాడే లచ్చించారులో గోంగూర పచ్చడి నంజుకుంటూ భోజనం చేస్తే ఆ రోజు విందు మహా పసందే. వేడివేడి అన్నంలో లచ్చించారును కొసరి కొసరి వడ్డిస్తుంటే లొట్టలు వేసుకుంటూ తినాల్సిందే. బ్రిటిష్ దొరలచే వండర్ ఫుల్ సూప్ అని కితాబు ఇచ్చుకున్న లచ్చించారు రుచికే కాదు ఆరోగ్యానికి దివ్య ఔషధమే. అచ్చమైన ఆరణాల తెలుగింటి వంట లచ్చించారు. ఆ ఘుమఘుమలు ఇప్పుడు దాదాపు కనుమరుగైపోయాయి.

అసలు పేరు లక్ష్మీచారు అయినా వాడుకలో లచ్చించారుగా మారింది. గతంలో వేసవి రాగానే పల్లెటూర్లలో దాదాపు అందరి ఇళ్లలోను లచ్చించారు కుండను ఆనవాయితీగా పెడుతుండేవారు. మట్టికుండకు పసుపు రాసి కుంకుమ బొట్టులు పెట్టి గదిలో ఓ మూలన ఉంచి సంప్రదాయబద్ధంగా లక్ష్మీదేవిని పూజించేవారు. ఆరోజు నుంచి ఇంట్లో బియ్యం కడిగిన నీళ్లను ఆ కుండలో పోసేవారు. ఇలా నాలుగు రోజుల వరకు ఉంచిన కడుగు నీళ్లు బాగా పులుస్తాయి. ఈ పులిసిన కడుగులో వంకాయలు, టమాట, బెండకాయలు, ములగకాడ, కొత్తిమీర వేసి తాలింపుపెడితే ఘుమఘుమలాడే లచ్చించారు తయారయ్యేది. కాయగూరగలతో పాటు ఎండి రొయ్యల తలలు వేసిన కాసిన లచ్చించారులో ఉప్పు చేప నంజుకుని భోజనం చేస్తే ఆ టేస్టే వేరంటారు మాంసాహార ప్రియులు. అతిథులు వచ్చినపుడు ఈ లచ్చించారు కుండ ఆపద్బాంధవుడిలా ఆదుకునేదని పెద్దలు చెబుతుంటారు. బియ్యపు కడుగులో 'డి' విటమిన్‌తో పాటు లచ్చించారులోని ఎన్నో బలవర్ధకమైన పోషకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నమ్మకం. ఒక ఇంటి వారు కుండ ఏర్పాటు చేసుకుంటే ఇరుగు పొరుగు అందులోని కడుగును తీసుకువెళ్లి లచ్చించారు కాసుకోవడం పల్లెల్లో ప్రతిచోటా కనిపించేది. సూప్స్, పాశ్చాత్య వంటకాలు మోజులో కాలక్రమంలో సంప్రదాయబద్ధంగా వచ్చిన లచ్చించారు కనుమరుగై ఇప్పుడు వేడుకల్లో అక్కడక్కడ ప్రత్యేక వంటకంగా భోజన ప్రియుల నోరూరిస్తోంది.

సెంటిమెంట్ చారు

- జిహ్వకు వహ్వా అనిపించే లచ్చించారుకు సెంటిమెంట్లు ఎక్కువే. ధాన్యా పంట ఇంటికి చేరగానే లక్ష్మీదేవిని పూజించి ఆ బియ్యాన్ని తీసుకుని దానిని కడగగా వచ్చిన కడుగుతో కుండను ప్రతిష్ఠింప చేస్తారు.
- పెళ్లి జరిగిన ఇంటిలో ఆరు నెలల వరకు లచ్చించారును కాసుకునే వారు కాదు.
- ఇరుగు పొరుగు వారు వచ్చి అడిగినా మంగళ, శుక్రవారాలలో లచ్చించారు కడుగును బయటకు ఇచ్చేవారు కాదు.
- ఉమ్మడి కుటుంబాలు విడిపోతున్నపుడు ఆ ఇంటికి సంప్రదాయంగా ఉంటున్న లచ్చించారు కుండ ఎవరికి దక్కాలన్న విషయమై అందరూ పట్టుబడతారు. ఒక్కోసారి వేలం పాటల ద్వారా ఉమ్మడి కుటుంబాల వారు ఈ కుండలను దక్కించుకునే వారిని పెద్దలు చెబుతుంటారు.

ఎంతో రుచిగా ఉండేది



లచ్చించారు ఎంతో రుచిగా ఉండేది. పూర్వం ప్రతి ఇంటిలో లచ్చించారు కాచేవారు. ఇప్పుడు తరం వారిలో లచ్చించారు తెలిసిన వారు చాలా తక్కువని చెప్పవచ్చు. మా చిన్నతనంలో లచ్చించారు కుండ కోసం వేలం పాటలు జరిగిన ఘటనలు ఉన్నాయి.

–చల్లా వీర్రాజు, నేలటూరు

చలివేంద్రాలతో ఉపశమనం



అంబాజీపేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: వేసవి తాపం నుంచి సేద తీరేందుకు చలివేంద్రాలతో ఉపశమం పొందవచ్చని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎండలు మండిపోతున్నాయని అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద, ముఖ్య కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీ బుడితి సత్యనారాయణమ్మ, విత్తనాల శేఖర్, రాయుడు కృష్ణమహేష్, మామిడిశెట్టి బుల్లియ్య, దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు.